

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

విద్యార్థులు జిల్లాస్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలలో తమలోని ప్రతిభను బయటకు తీశారు. వివిధ సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారు. -8లో



మళ్లీ వాయిదా పడిన గుత్తల వేలం

మదనపల్లె మున్సిపాలిటీకి చెందిన వారపు సంత, దినసరి మార్కెట్, టౌన్‌హాలు గుత్తలను అప్పగించేందుకు నిర్వహించిన వేలం పాటలు మళ్లీ వాయిదా పడ్డాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.100	రూ.160



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 116 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	511	511
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 168.800 కిలోలు

మళ్లీ నేలచూపులు



- వారం రోజులుగా తగ్గుముఖం పట్టిన టమాటా ధరలు
- దారుణంగా పడిపోతున్న వైనం
- ఆందోళనలో రైతులు



రాయచోటి మార్కెట్లో బాక్సుల్లో నింపిన టమాటాలు

రాయచోటి/గుర్రంకొండ: టమోటా ధరలు నేలచూపులు చూస్తున్నాయి. కొన్నాళ్లుగా నిలకడగా సాగుతున్న ధరలు.. వారం రోజులుగా తగ్గుతున్నాయి.నిలకడలేని ధరలు, తగినంత ఎగుమతులు లేకపోవడం తదితర కారణాలతో రైతులు ఆర్థికంగా దెబ్బతింటూనే ఉన్నారు. ధర పెరిగింది అనుకునే లోపు మళ్లీ తగ్గిపోవడంతో చాలా వరకు నష్టాలనే చవిచూశారు. గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన సందర్భాలు లేకపోలేదు. గతేడాది సంఘటనలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. నష్టాలను దిగమింగుకుని ఈ ఏడాది రైతులు పంట పెట్టారు. గత ఏడాది జిల్లాలో 18 వేల ఎకరాల్లో సాగు కాగా ఈసారి 10 వేల ఎకరాలకు తగ్గినట్లు ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని గుర్రంకొండ, మదనపల్లె, కలకడ, వాయల్పాడు, కలికిరి, రాయచోటి టమాట మార్కెట్ల నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో స్థానికంగా కాయలు మార్కెట్‌కు రాకపోవడం కలిసొచ్చింది. నిత్యం నష్టాలను చవిచూసిన రైతులకు కొంత ఊరటనిచ్చాయి. ప్రస్తుతం పరిస్థితులు మళ్లీ మొదటికి తెస్తున్నాయన్న భయం సంబంధిత వర్గాల్లో నెలకొంటున్నాయి. కొన్ని రోజులుగా ధరల్లో తగ్గుదల కనిపిస్తోంది. వారం రోజులుగా పరిస్థితి మరింత దిగజారుతోంది. కలకడ, గుర్రంకొండ, మదనపల్లె మార్కెట్లలో 15 కిలోల టామాట బాక్సు రూ.150 పలకడం రైతులను కుంగతీస్తోంది. రాయచోటి మార్కెట్లో 25 కిలోల బాక్స్ రూ.250 పలికింది. దీంతో సంబంధిత రైతుల్లో ఆందోళన నెలకొంది.

- సీజన్ ప్రారంభం నుంచి గుర్రంకొండ, మదనపల్లె, కలకడ టమాటా మార్కెట్లలో మేలిరకం కాయలు కిలో రూ.30 నుంచి రూ.35 మధ్య పలికాయి. గత నెలలో రూ.40 నుంచి రూ.47 వరకు పలికాయి. అంటే 15 కిలోల బాక్సు రూ.600 నుంచి రూ.700 మధ్య అమ్ముడుపోయింది. సరాసరి గత రెండు, మూడు నెలలు 15 కిలోల బాక్సు రూ.350 నుంచి రూ.400 పలికినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. గత వారం రోజులుగా పరిస్థితులు మారిపోయాయి. కిలో రూ.10, రూ.15 లోపే పలుకుతున్నాయి. గురువారం ధరలు మరింత దిగజారిపోయాయి. కిలో గరిష్ట ధర రూ.10తో అమ్ముడుపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం వైపు టమాటా రైతుల చూపు: మార్కెట్లో టమాట ధరలు అత్యధికంగా పలుకుతున్నప్పుడు ధరలు తగ్గించి విక్రయించాలని మార్కెట్ అధికారులను ఆదేశించే ప్రభుత్వం నేడు తమను ఆదుకోవాలని టమాటా రైతులు కోరుతున్నారు. 25 కేజీల క్రీట్ ధర గతంలో రూ. 2500 ఉన్నప్పుడు ప్రభుత్వం మార్కెట్లో ధరలు తగ్గించి రూ.1000కే ప్రజలకు అందించిన దాఖలాలు ఉన్నాయి. ఆదేవిధంగా నేడు ధరలు తగ్గుముఖం పడుతున్నందున ప్రభుత్వమే గిట్టుబాటు ధరలు కల్పించి టమాటాలు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తగ్గుతున్న ఎగుమతులు



జిల్లాలో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఎగుమతులు మందగించాయంటూ మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ప్రభావం ప్రస్తుత ధరలపై పడుతోందని చెబుతున్నారు. జిల్లాలోని మార్కెట్ల నుంచి పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణతో పాటు ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు టమాటా ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఆయా మార్కెట్లకు స్థానికంగా పండించిన కాయలు వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎగుమతులు లేక ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని రైతులు అంటున్నారు. అమ్మకాలు తగ్గిపోవడంతో రెండు, మూడు బండ్లు లోడు చేసే వ్యాపారులు ఒకటికి చాలు అంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం పండించిన పంటకు ధరలు అనుకూలంగా లేకపోవడంతో కూలీల ఖర్చులు కూడా వచ్చేలా లేవని రైతులు మదనపడుతున్నారు. .

గత వారం రోజులుగా టమాటా, ధరల వివరాలు

తేదీ	ధరలు (25కేజీలక్రీట్)
సెప్టెంబర్ 06	రూ.350
07	రూ.400
08	రూ.410
09	రూ.350
10	రూ.300
11	రూ.350
12	రూ.320

పెట్టుబడి వచ్చే అవకాశం లేదు



రోజురోజుకు టమాటా ధరలు తగ్గిపోతున్నాయి. దీంతో పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేకుండా పోతోంది. నెలరోజుల క్రితం మార్కెట్లో 25 కేజీల క్రీట్ ధర రు. 800 నుంచి రూ.900 వరకు ధరలు పలికాయి. వారం రోజులుగా ధరలు దారుణంగా పడిపోయాయి. – వెంకటరమణ, గుట్టకిందపల్లె

దిగుబడులు ఎక్కువగా ఉన్నాయి



బయట రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దిగుబడులు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో టమాటా ధరలు ఆశించినంతగా పెరగడం లేదు. గత వారం రోజులుగా మార్కెట్లలో టమాటా ధరలు తగ్గిపోతున్నాయి.. వర్షాలకు ఇక్కడి టమాటా తోటలు దెబ్బతిన్నాయి. – కుమార్‌రెడ్డి, కార్యదర్శి, వాల్మీకిపురం మార్కెట్ కమిటీ




పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు



పత్రికా స్వేచ్ఛను హరించేలా కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తోంది. పోలీసులతో కేసులు పెట్టిస్తూ భయపెట్టాలని చూస్తోంది. ఇటీవల ఒక నాయకుడి ప్రెస్‌మీట్ కవర్ చేసినందుకు కేసు పెట్టడం దుర్మార్గం. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగేలా, ప్రజాస్వామ్య విలువలకు భంగం వాటిల్లేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. –వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎంపీ, కడప

కక్షపూరితం..దుర్మార్గం



పత్రికా స్వేచ్ఛ అనేది భావ ప్రకటన స్వేచ్ఛ అని ప్రభుత్వంలో ఉన్న వారికి తెలియంది కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)ఏ ప్రసాదించింది. ప్రజల గొంతుకైన పత్రిక పట్ల, పత్రిక ఎడిటర్ పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గం. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం ఇది మంచిది కాదు. పత్రికలో వచ్చే వార్త లేదా కథనంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చు. లేదా రిజాయిండర్ ఇవ్వవచ్చు. దానికి స్పందించకపోతే పరువునష్టం దావా వేసుకోవచ్చు. అంతేకాని భయపెట్టి తన దారిలోకి తెచ్చుకోవాలనే కుతంత్రంతో తప్పుడు కేసులు పెట్టడాన్ని సమాజం హర్షించదు. వెంటనే సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పెట్టిన కేసును ఎత్తివేయాలి. – మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభసభ్యుడు

కొనసాగుతున్న వర్షాలు



కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా వైఎస్ఆర్ కడప జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పెద్దముడియంలో 9.8 మిల్లీమీటర్లు, ప్రొద్దుటూరులో 9, రాజుపాళెం 8.8, దువ్వూరు 7.4, మైదుకూరు 6, చాపాడు 5.2, కలసపాడు 5, కమలాపురం 4.6, కడప 3.8, కొండాపురం 2.8, తొండూరు 2.4, ఎర్రగుంట్లలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

బార్ల దరఖాస్తుకు గడువు పెంపు

రాయచోటి టౌన్: జిల్లాలో జనరల్ బార్లకు దరఖాస్తు చేసుకొనేందుకు గడువు పొడిగించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి. మధుసూదన్ శుక్రవారంపేర్కొన్నారు. రాయచోటిలో ఒకటి, మదనపల్లెలో ఒకటి, పీలేరులో ఒకటి ఇలా మొత్తం మూడు బార్ల కోసం దరఖాస్తుచేసుకోవాలన్నారు. ఈ నెల 17న సాయంత్రం6 గంటల వరకు గడువు ఉందని తెలిపారు. 18వ తేదీ ఉదయం 8 గంటలకు వాటికి సంబంధించి డ్రా తీయనున్నట్లు పేర్కొన్నారు.

మిసెస్ ఇండియా విజయలక్ష్మికి సన్మానం



విజయలక్ష్మిని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు

సంబేపల్లె: ఇటీవల జరిగిన మిసెస్ ఇండియా సీజన్- 5 పోటీల్లో విజేతగా నిలిచిన కవ్వం విజలక్ష్మిని శుక్రవారం హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన మండలంలోని పీఎన్‌కాలనీ గ్రామం మినమరెడ్డిగారిపల్లెకు వచ్చింది. ఈక్రమంలో ఆమె చదువుకున్న సంబేపల్లె జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు విజయలక్ష్మికి అభినందనలు తెలిపారు.అనంతరం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

రాయచోటి: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టుల్లో ఈనెల 13వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. ఈ మేరకు చైర్మన్ కమ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి యామిని, వైఎస్సార్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 23 బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కడప 4, ప్రొద్దుటూరు 3, రాజంపేట 3, రాయచోటి 3, బద్వేల్ 2, సిద్దవటం, మైదుకూరు, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, నందలూరు, రైల్వేకోడూరులలో ఒక్కో బెంచీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 08562-258622, 244622 నంబర్లల్లో సంప్రదించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా తెలియజేశారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకొని సత్వర న్యాయం పొందవచ్చన్నారు.

కుటుంబం...బ్యాంకు బాధ్యతలు

బ్యాలెన్స్ చేయలేక పోతున్నా..


- లేఖలో రాసిపెట్టి...
- బ్యాంకులోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న మేనేజర్ పవన్ కుమార్ నాయుడు



మృతి చెందిన బ్యాంక్ మేనేజర్ పవన్ కుమార్ నాయుడు

రాయచోటి: కుటుంబం, బ్యాంకు పరిధిలోని బాధ్యతలను సమన్వయం చేయలేక తనువు చాలిస్తున్నట్లు స్వహస్తాలతో లేఖరాసి తాను పనిచేస్తున్న బ్యాంకులోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న వైనం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో సంచలనంగా మారింది. రాయచోటిలోని కరూర్ వైశ్యా బ్యాంకులో మేనేజర్ పవన్ కుమార్ నాయుడు (38) శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో బ్యాంకులోని మరుగుదొడ్డిలో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సుండుపల్లి మండలం, చప్పిడివారిపల్లికి చెందిన పవన్ కుమార్ నాయుడు ఐదు నెలల క్రితం బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో మరుగుదొడ్డిలోకి వెళ్లిన మేనేజర్ ఎంతసేపటికీ బయటకు రాలేదు. బ్యాంకు ఉద్యోగులు పిలిచినా పలుకలేదు. దీంతో డోర్ పగులకొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించడం అందరినీ భయభ్రాంతులకు గురి చేసింది. వెంటనే బ్యాంక్ ఉద్యోగులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాయచోటి అర్బన్ సీఐ బివి చలపతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్యకు గల కారణాలు లేఖలో రాసిపెట్టినట్లు తెలిసింది. కుటుంబ బాధ్యతలను, బ్యాంకు పని ఒత్తిడిని సమన్వయం చేసుకోవడంలో విఫలం అయ్యానని రాసినట్లు తెలిసింది. బ్యాంకులో పని ఒత్తిడి కారణంగానే తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డారని మృతుని భార్య అనూష ఆరోపిస్తున్నారు. పోలీసులు లేఖను స్వాధీనం చేసుకున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అయితే లేఖలో రాసిన విషయాలతోపాటు ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు లోతుగా విచారణ చేస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని బ్యాంక్ సిబ్బంది, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పంచనామా నిమిత్తం బ్యాంక్ మేనేజర్ మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు పవన్ కుమార్ నాయుడుకు భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా



- పట్టించుకోని అధికారులు
- ఫిర్యాదు చేసిన సీపీఐ మండల కార్యదర్శి సెల్వకుమార్
- ఫిర్యాదు చేశారని భార్యతోపాటు సెల్వకుమార్‌పై టీడీపీ నాయకుల దాష్టీకం
- సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి, డీజీపీలకు ఫిర్యాదు చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య



దాడిలో గాయపడిన సెల్వకుమార్

సాక్షి కడప: అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం దళాయిపల్లి పంచాయతీ కేతరాజుపల్లె గ్రామ రెవెన్యూ 205, 206 సర్వే నంబర్లలోని సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని టీడీపీ నేతలు ఆక్రమించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని... అంతేకాకుండా ఆక్రమించారని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడటం ఎంత వరకు న్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. అందుకు సంబంధించి శుక్రవారం ఈశ్వరయ్య జరిగిన ఆక్రమణలపై రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, హోంమంత్రి, రాష్ట్ర డీజీపీలకు ఆయన ఫిర్యాదు చేశారు. సత్వరం విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

దళాయిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు రాజారెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటరెడ్డి, ప్రభుత్వ భూమిని ఆక్రమించడం.. ఈనెల 9న పుల్లంపేట తహసీల్దార్‌కు ప్రభుత్వ భూమి కబ్జా అయిందని సీపీఐ నాయకత్వానా విన్నవించామన్నారు. ఆ విషయాన్ని తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వీఆర్‌ఓ కబ్జాదారులకు సమాచారం అందించగా అది తెలుసుకున్న టీడీపీ నాయకులు 10 తేదీ రాత్రి 9 గంటలకు పుల్లంపేట మండల సీపీఐ కార్యదర్శి సెల్వకుమార్‌కు ఫోన్ చేసి రాత్రి పూట పిలిపించి అత్యంత దారుణంగా తిట్టారని, బెదిరించారని వివరించారు. దాంతో సరిపెట్టుకోకుండా 11వ తేదీ అర్ధరాత్రి 1 గంట సమయంలో సెల్వకుమార్, నిండు గర్భిణి అయిన భార్య బిందుప్రియపై దాడి చేశారని తెలిపారు. ఆరుబయట నిద్రిస్తుండగా సెల్వకుమార్‌తోపాటు ఆయన భార్యపై టీడీపీ నాయకులు రాజారెడ్డి, వెంకటసుబ్బయ్య, వెంకటరెడ్డి, సాయికుమార్ తోపాటు మరో పది మంది దాడి చేయడంతోపాటు భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. అప్పటికి భార్యభర్తలు ఇరువురు ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకోగా వాకిళ్లను తన్నుతూ భయపెట్టినట్లు తెలిపారు. అంతేకాకుండా ఇంటి ఆవరణలో ఉన్న ఎయిర్ కూలర్, టీవీఎస్ ఎక్సెల్‌ను ధ్వంసం చేయడంపై ఈశ్వరయ్య మండిపడ్డారు. ఇప్పటికే భారత కమ్యూనిస్టు పార్టీ పలు పర్యాయాలు భూమి కబ్జా జరుగుతున్న విషయం తెలియజేసినా తహసీల్దార్ పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయని తెలిపారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు సృష్టించడంతోపాటు ఈవీఎంలు పగులగొట్టిన చరిత్ర ఉందని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిందితులపై హత్యాయత్నం కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూములను కాపాడాలని సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి, డీజీపీలను ఈశ్వరయ్య కోరారు. అందుకు సంబంధించి వారికి వినతి పత్రం అందించారు.

క్లుప్తంగా

ఓంకారేశ్వర్ కుటుంబానికి ఆర్థికసాయం



అమృతకు ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయురాలు సురేఖ

కడప కోటిరెడ్డిసర్కిల్ : రామాపురం మోడల్ స్కూలులో ఒకేషనల్ ఐటీ ట్రేడ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓంకారేశ్వర్ కుటుంబానికి సహచరులు ఆర్థికసాయం అందజేసి తమవంతుగా తోడ్పాటు అందించారు. ఓంకారేశ్వర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. ఈ క్రమంలో స్కిల్ ట్రీ కంపెనీ లిమిటెడ్ ఒకేషనల్ ట్రైనర్స్, ఒకేషనల్ కో ఆర్డినేటర్స్ సహకారంతో రూ. 1,15,000 సేకరించి ఆ మొత్తాన్ని శుక్రవారం మృతుడి సతీమణి అమృతకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆర్థికసాయం అందించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలు సురేఖ, కో ఆర్డినేటర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా..ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాయచోటి దిగువ అబ్బవరంకు చెందిన సుబ్బయ్య విరూపాక్షి పురం నుంచి రాయచోటి వస్తున్న క్రమంలో చిన్నమండెం మండ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన వెంకటస్వామి కలకడలో సుబ్బయ్య వస్తున్న ఆటో ఎక్కాడు. ఈ క్రమంలోనే సంబేపల్లె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. విషయం తెలిసి పోలీసులు సంఘనా స్థలానికి చేరుకున్నారు. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆటో అదుపు తప్పి మహిళకు గాయాలు

రామసముద్రం : రామసముద్రం మండలం కుదురుచీమనపల్లి వద్ద ఆటో అదుపు తప్పి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాగిమాకులపల్లి పంచాయతీ పేడరాజుపల్లికి చెందిన గెంగిరెడ్డి భార్య పద్మావతమ్మ (50) పుంగనూరు నుంచి సొంత గ్రామానికి ఆటోలో వెళ్తుండగా కెసి. పల్లి వద్ద కుక్క అడ్డురావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ప్రమాదంలో పద్మావతికి కాలు తీవ్ర గాయాలు కాగా. స్థానికులు 108అంబులెన్స్ కు సమాచారం అందించారు. సిబ్బంది ప్రసాద్, పైలెట్లు హుటాహుటిన బాధితురాలును చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మునయ్యకోనలో మృతదేహం లభ్యం

ముద్దనూరు : ముద్దనూరు–జమ్మలమడుగు రహదారిలోని మునయ్యకోనలో చిట్టిబోయిన గంగాధర్(53)అనే వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు గుర్తించారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు.. తొండూరు మండలం గంగాదేవిపల్లెకు చెందిన గంగాధర్ రెండురోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. మునయ్యకోనలో అతడి మృతదేహాన్ని గుర్తించారు. మరణానికి చెందని కారణాలు ఇతర వివరాలపై విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

బతికుండగానే చంపేశారు

- రూ.2కోట్లు విలువైన ప్రభుత్వ ఉద్యోగి స్థలాన్ని డెత్ సర్టిఫికెట్‌తో అమ్మేశారు
- ఎన్జీఓ ప్లాట్ 300కు సంబంధించి వెలుగుచూసిన సంఘటన



ప్రభుత్వ ఉద్యోగి స్థలాన్ని అమ్మిన వారు, కొన్నవారు



బతికుండగానే గంజికుంట సుబ్బరాయుడు మరణ ధృవీకరణ పత్రం



గంజికుంట సుబ్బరాయుడు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు

ప్రొద్దుటూరు : బతికుండగానే ప్రభుత్వ ఉద్యోగి చనిపోయినట్లు ఏకంగా డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించి రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని మరొకరికి అమ్మారు. ప్రభుత్వ ఉద్యోగి వీఆర్ఎస్ పొంది ప్రతినెలా పెన్షన్ తీసుకుంటున్నారు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన ఈ సంఘటనను తెలుసుకుని అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. సంఘటన ఎవరు చేశారు.. ఎలా జరిగింది... ఎవరెవరి హస్తం ఉంది అనే వివరాల గురించి ఇప్పటి వరకు సంబంధిత అధికారులు ఆరా తీయలేదు. వివరాలు ఇలా ఉన్నాయి..

ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 1980 ప్రాంతంలో ఎన్జీఓ ప్లాట్లు వేశారు. ప్రస్తుతం ఈ స్థలం విలువ రూ.కోట్లు పలుకుతోంది. ఈ కాలనీలోనే గంజికుంట సుబ్బరాయుడు (నీటి పారుదల శాఖ రిటైర్డు ఎస్ఈ)కు 1986లో సర్వే నంబర్ 194, 196లోని ప్లాట్ నంబర్ 300లోని 7.5 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఆయన గత 40 ఏళ్లగా తన స్థలాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు.

డెత్ సర్టిఫికెట్ సృష్టించి...

గంజికుంట సుబ్బరాయుడు నీటి పారుదల శాఖలో ఎస్ఈగా పనిచేసి 2003లో వీఆర్ఎస్ పొంది ప్రభుత్వం నుండి ప్రతి నెల పెన్షన్ తీసుకుంటున్నారు. కర్నూలు నగరంలోని కృష్ణానగర్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ నుంచి పెన్షన్ పొందుతున్నారు. గంజికుంట సుబ్బరాయుడు, తన భార్య గంజికుంట వెంకటసుబ్బమ్మ ప్రొద్దుటూరు పట్టణంలోని బుడ్డాయపల్లెలో నివాసం ఉంటున్నారు. ఇది ఇలా ఉండగా.. హైదరాబాద్ నగరంలోని లింగంపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఉన్న (ఆధార్ కార్డు 994947290378) వివరాలతో గంజికుంట సుబ్రహ్మణ్యం ఫేక్ డ్యాక్యుమెంట్లు సృష్టించి ఈ స్థలాన్ని కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన వద్ది నారాయణ కుమారుడు నాగరాజు (ఆధార్ కార్డు నంబర్ 879824061289)కు రిజిస్టర్ చేయించారు. తన తండ్రి గంజికుంట సుబ్బరాయుడుతోపాటు తల్లి గంజికుంట లక్ష్మీదేవి మరణించినట్లు ఏకంగా మున్సిపాలిటీ నుంచి డెత్ సర్టిఫికెట్లు తీసుకుని జత చేశారు. వాస్తవానికి గంజికుంట సుబ్బరాయుడుకు గంజికుంట సుబ్రహ్మణ్యంకు ఎలాంటి సంబంధం లేదు. ఆయన ఎవరో వీరికి తెలియదు, ఎలాంటి సంబంధాలు లేవు. ఈ ఏడాది ఆగస్టు 13న ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ రిజిస్టర్ జరిగింది. స్టాంప్ రైటర్ తొండలదిన్నె శ్రీనివాసులు ఈ డాక్యుమెంట్‌ను తయారు చేయగా, దొరసానిపల్లెకు చెందిన వరద ఆంజనేయులు, డ్రైవర్ కొట్టాలకు చెందిన నల్లు జయశంకర్ సాక్షులుగా ఉన్నారు. తనకు జరిగిన మోసాన్ని తెలుసుకున్న గంజికుంట సుబ్బరాయుడు కొద్ది రోజుల క్రితం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఈ విషయంపై శుక్రవారం సాయంత్రం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ జీఎస్‌జీ రామదాసును సాక్షి వివరణ కోరగా ఫేక్ రిజిస్ట్రేషన్ జరిగినట్లు తనకు ఎవరు ఫిర్యాదు చేయలేదన్నారు.

శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజ



అమ్మవారికి రాహుకాల పూజలు చేస్తున్న మహిళ భక్తులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో అమ్మవారికి రాహుకాల పూజను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించి పూలు, బంగారు ఆభరణాలు, బంగారు ఆభరణాలతో పాటు నిమ్మకాయలతో హారాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అలాగే భక్తులు అమ్మవారికి నిమ్మకాయలపై ఒత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

అత్తపై దాడిచేసిన అల్లుడు అరెస్టు

నందలూరు : లేబాక గ్రామ పంచాయతీ మరాఠి పల్లి గ్రామంలో అత్తపై దాడి చేసి పారిపోయిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రాజంపేట ఏఎస్పీ మనోజ్ కుమార్ హెగ్డే పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 7 తేదీన సాయంత్రం లేబాక మరాఠ పల్లి కి చెందిన సింధే పద్మావతిభాయిని చంపాలనే ఉద్దేశంతో మచ్చుకత్తితో దాడిచేసి పారిపోయిన వాయకారి నరసింహులును నందలూరు బస్‌స్టాండ్ వద్ద అదుపులోకి తీసుకొని అతని నుంచి మచ్చుకత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతపురం టౌన్ కి చెందిన నరసింహులుకి 13 సంవత్సరాల క్రితం పద్మావతి భాయి కుతూరు మంజుల భాయితో వివాహమైంది. వారికి ఒక కొడుకు, కుతూరు ఉన్నారు. నరసింహులు చెడు అలవాట్లకు భానిసై భార్యను పిల్లలను పట్టించుకోకుండా హింసిస్తూ ఉండటంతో మంజుల భాయి భర్తకు దూరంగా తన ఇద్దరి పిల్లలను తల్లి పద్మావతి భాయి దగ్గర ఉంచింది. బతుకుదెరువు నిమిత్తం కువైట్కి వెళ్ళింది. అయితే భార్యా, పిల్లలు దూరం కావడానికి అత్తే కారణమని పగ పెంచుకొని, అతడి జల్సాలకు డబ్బు ఇవ్వలేదనే కోపంతో పద్మావతి భాయిని చంపాలని ప్లాన్ వేసుకొని ఈనెల 7వ తేదీ సాయంత్రం మచ్చుకత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై పద్మావతి భాయి కోడలు శ్యామల భాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందలూరు పోలీసులు కేసు నమోదు చేసి వాయకారి నరసింహులును ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బంది అరెస్ట్ చేశారు. రిమాండ్ నిమిత్తం నందలూరు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

అట్టర్‌ఫ్లాప్ పాలనకు విజయోత్సవాలా?

- అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడంలో సూపర్‌హిట్
- పదిహేనేళ్లు ఒక్క మెడికల్ కాలేజీని స్థాపించారా?
- 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల మంజూరు ఘనత వైఎస్ జగన్‌ది
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కూటమి అట్టర్‌ఫ్లాప్ పాలనకు విజయోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. కడపలో శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10వ తేదీ కూటమి నేతలు అనంతపురంలో 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' అంటూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి డ్వాక్రా మహిళలను బలవంతంగా తరలించి విజయోత్సవ సభ నిర్వహించడం విచిత్రంగా ఉందన్నారు. పదహారు నెలలుగా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడం, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనబెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడంలో.. 5లక్షల పింఛన్లు తొలగించడం, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేయడంలో.. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇవ్వకుండా మోసం చేయడంలో సూపర్ హిట్ సాధించారని ఎద్దేవా చేశారు. 87లక్షల మందికి 'తల్లికి వందనం' ఇవ్వాల్సి ఉండగా, 54లక్షల మందికే ఇచ్చి, 16 నెలల్లో ఒక సిలిండర్ మాత్రమే ఉచితంగా ఇచ్చి, 5 రకాల సర్వీసుల్లోనే ఉచిత బస్సు ప్రయాణం కల్పించి బంపర్‌హిట్ కొట్టారని ఎద్దేవా చేశారు. 'అన్నదాత సుఖీభవ' పథకానికి మొదటి ఏడాది పంగనామం పెట్టారని, రెండో ఏడాది రూ.5వేలు మాత్రమే ఇచ్చి 7లక్షల మందికి కోత వేశారన్నారు. యాభై ఏళ్ల దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్లు ఇస్తామని మోసగించారన్నారు. పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కళాశాలను స్థాపించలేదని, ఐదేళ్లు సీఎంగా పనిచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 కొత్త మెడికల్ కాలేజీలు తీసుకొచ్చి మొనగాడుగా నిలిచారన్నారు. వాటిలో 10 మెడికల్ కాలేజీలను ఈ ప్రభుత్వం ప్రైవేటుకు అమ్మేయాలను కోవడం దారుణమన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేలను నిర్వీర్యం చేయడంలో..రైతులకు యూరియా దొరక్కుండా చేయడంలో ఈ ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. వలంటీర్ల జీతం పది వేలకు పెంచుతామని చెప్పి ఆ వ్యవస్థనే ఎత్తేశారన్నారు. ప్రభుత్వ బడులు, వైద్యశాలలను.. ఆరోగ్యశ్రీ పథకాన్ని పతనావస్థకు తీసుకుపోయారన్నారు. కూటమి నేతలు విజయోత్సవ సభ నిర్వహించిన జిల్లాలోనే ఓ టీడీపీ ఎమ్మెల్యే జూనియర్ ఎన్టీఆర్ తల్లిని తీవ్రంగా అవమానిస్తే అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు దక్కిన గౌరవం ఇదేనని ఎద్దేవా చేశారు. ఇక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని ఇద్దరు మృతి

ఒకరికి తీవ్ర గాయాలు





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వృద్ధురాలు అంకమ్మ, రామచంద్రయ్య

ఓబులవారిపల్లె : మంగంపేట చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రోడ్డు దాటుతుండగా ఆర్‌కె ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో అంకమ్మ (80), రామచంద్రయ్య (57) అక్కడికక్కడే మృతి చెందగా రామలక్ష్మమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు మంగళంపల్లి గ్రామానికి చెందిన అంకమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంగా ఉండటంతో ఆమె కుమార్తె రామలక్ష్మమ్మ, అల్లుడు రామచంద్రయ్యలు ఉదయం చికిత్సకోసం తిరుపతికి వెళ్లారు. పనులు పూర్తి కావడంతో బస్సులో మంగళంపల్లికి వెళ్లడానికి చెన్నకేశవ స్వామి గుడి క్రాస్ వద్ద దిగారు. తమ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా తిరుపతి నుండి రాజంపేటకు వెళ్తున్న ఆర్‌కె ట్రావెల్స్ బస్సు వేగంగా రోడ్డు దాటుతున్న వారిని ఢీ కొంది. వృద్ధురాలు అంకమ్మ, అల్లుడు రామచంద్రయ్యకు తలకు తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. రామలక్ష్మమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఓబులవారిపల్లి నుండి రైల్వేకోడూరుకు వెళ్తున్న ఎస్ఐ పి మహేష్ ప్రమాదం జరిగే సమయానికి సమీపంలో ఉన్నారు. విషయం గమనించిన ఆయన తీవ్రంగా గాయపడ్డ రామలక్ష్మమ్మను 108 వాహనంలో చికిత్స నిమిత్తం తరలించి ఆర్‌కె ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



జ్ఞాపికలను అందుకున్న విజేతలతో డీఈఓ సుబ్రమణ్యం



కళా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ముగిసిన కళా ఉత్సవ్–2025 పోటీలు

రాయచోటి : పాఠాలు చదువుతూ బిజీగా ఉండే విద్యార్థులు జిల్లాస్థాయి కళా ఉత్సవ్–2025 పోటీలలో తమలోని ప్రతిభను బయటకు తీశారు. వివిధ సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు సత్తాచాటి శభాష్ అనిపించుకున్నారు. రాయచోటిలోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో రెండు రోజులపాటు నిర్వహించిన ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాస్థాయి కళా ఉత్సవ్–2025 పోటీలు రెండురోజులపాటు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగి శుక్రవారం ముగిశాయి. ఆరు కళారూపాలలో పన్నెండు అంశాలకు సంబంధించి వ్యక్తిగత, బృందాలకు నిర్వహించిన ఈ పోటీలలో 37 పాఠశాలలకు సంబంధించి 110 మంది విద్యార్థినీ విద్యార్థులు పోటాపోటీగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం విద్యార్థుల ప్రదర్శనలపట్ల అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజేతలు వీరే...

గాత్ర సంగీతం వ్యక్తిగత విభాగంలో నజియా తబస్సు (ప్రభుత్వ బ్లైండ్ పాఠశాల, కడప) బృందం విభాగంలో హాసిని, హర్షిత, హిమబిందు (ఎంజేపీ ఏపీబీసిడబ్ల్యుఆర్ స్కూల్, నందలూరు), వాద్య సంగీతం వ్యక్తిగత విభాగంలో ఎస్ మహమ్మద్ సల్మాన్ (ప్రభుత్వ బ్లైండ్ పాఠశాల కడప), బృందం విభాగంలో జీవన్ కుమార్, సందీప్ రెడ్డి, భావన కుమార్, హరిప్రసాద్ (ఏపీ మోడల్ స్కూల్, రాయచోటి), నృత్యం వ్యక్తిగత విభాగంలో ఎస్ హాసిని (ఎంజేపీఏపీ బీసిడబ్ల్యుఆర్ స్కూల్, నందలూరు), బృందం విభాగంలో గౌతమి, గంధర్విక, నాగ నిషిత, నందిని (జిల్లా పరిషత్ హైస్కూల్ కె రామాపురం, రాయచోటి మండలం), నాటకం విభాగంలో భాను ప్రసాద్, భాను ప్రకాష్, రామ్ గణేష్ రెడ్డి, పృధ్వీరాజు (ఏపీ మోడల్ స్కూల్, రాయచోటి) దృశ్యకళ వ్యక్తిగత విభాగం, చిత్రలేఖనంలో ఎస్ మహమ్మద్ జయిద్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డైట్, రాయచోటి) శిల్పకళలో యశ్వంత్ రెడ్డి (ఏపీ మోడల్ స్కూల్, సంబేపల్లి), బొమ్మల తయారీలో వీర అశ్విని (ఏపీ మోడల్ స్కూల్, రాయచోటి), సాంప్రదాయ కథ చెప్పడం (బుర్రకథ) నందు సమీరా, పూజా(ఏపీ మోడల్ స్కూల్, రాయచోటి)లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలలో ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజేతలకు డిఈఓ జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమ న్యాయ నిర్ణేతలుగా కేంద్ర, సాహిత్య అకాడమీ యువ పురస్కారం పొందిన ప్రముఖ రచయిత డాక్టర్ వేంపల్లి గంగాధర్, నాట్యకళాకారుడు స్వతంత్ర బాబు, సంగీత ఉపాధ్యాయులు నాగబూషణంలు వ్యవహరించారు. జిల్లాస్థాయి విజేతలుగా ఎంపికైన వారు అక్టోబర్ 24, 25వ తేదిలలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే కళా ఉత్సవ్ పోటీలలో పాల్గొంటారని కళా ఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, డిసిఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, జిల్లాలో వివిధపాఠశాలల నుండి వచ్చిన గైడ్ టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి నాగరాజు



జిల్లా ఫుట్‌బాల్ బాల, బాలికల జట్టుతో పీడీలు

మదనపల్లె సిటీ : విద్యార్థులు క్రీడల్లోరాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–19 బాల,బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక జరిగింది. విద్యార్థులు తమకు ఆసక్తికలిగిన క్రీడను ఎంచుకుని రాణించాలన్నారు. ఆటలు ఆడటం వల్ల ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటారన్నారు.కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు మురళీధర్‌రెడ్డి, సుధాకర్, దేవకమ్మ, అన్సర్, నరేష్, మహేంద్రనాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అండర్–19 బాలుర ఫుట్‌బాల్ జట్టు:

పి.రేవంత్, డి.నరేష్, జి.రాఘవేంద్ర, వై.వంశీకళ్యాణ్, వి.కార్తీక్,, ఎం.జీవన్‌సాయి, పి.దీక్షిత్‌రెడ్డి, కె.త్రివేది, టి.జాకబ్‌జయంత్, ధామస్, వి.ఉదయ్‌ముని, జి.హరీష్‌భారత్, సి.సుధీర్, పి.మనోజ్‌కుమార్, ఎ కెల్విన్‌కెనత్, డి.శివరంగ్, పి.నికిత్ స్టాండ్ బైలుగా సాయికిరణ్, ఎన్.జ్యోతిష్‌సాయి, ఎస్.ఇమ్రాన్‌సయ్యద్,పి.యాసర్‌లు ఎంపికయ్యారు.

అండర్–19 బాలికల జట్టు:

ఎన్.విష్ణుప్రియ, కె.నిశ్చిత,జి.హేమశ్రీ, ఎం.తన్మయ, పి.స్వాతి, యు.హారిక, జి.నూతనహర్షవర్ధిని, బి.శశికళ,ఎ.హాతిక, జి.హాన్సిక, ఈ.దేవిక,ఎస్.సహనాజ్, జి.పూజిత, కె.నందిని, ఎం.భావ్య, ఎస్.పల్లవి, జె.అనిత, స్టాండ్‌బైలు కె.స్నేహ, ఎస్.తబుసుమ్, జి.మాలతి, కె.శుభశ్రీలు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు. ఎంపికైనవారు హిందుపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికై వారికి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పీడీలు దేవకమ్మ,అన్సర్, సుదాకర్,జలజ తెలిపారు.

జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలుర జట్టు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జూనియర్ కబడ్డీ ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా క్రీడల ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న కబడ్డీ ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి బాలికలు 150 మంది, బాలురు 200 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కిరణ్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరి శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరి చంద్రావతి, జిల్లా కబడ్డీ ప్రెసిడెంట్ గురుశేఖర్, సెక్రటరి సుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవాణి, ఎస్‌జీఎఫ్ అండర్–19 సెక్రటరి చంద్రహాజరాజు, విక్టర్ కోచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి కబడ్డీ పోటీలకు ఎంపికైనది వీరే..

బాలురు జట్టు : వేణుసాయి, దుర్గశంకర్, బ్రహ్మయ్య, నూర్ భాష, మల్లిఖార్జున, కలాం, సాయి ప్రసాద్, యశ్వంత్, జయంత్ నాయక్, హుస్సేన్, మల్లిఖార్జున, నరేంద్ర, జశ్వంత్, గఫార్ బాషా.

బాలికల జట్టు : జ్యోత్స్న, నీల మహేశ్వరి, రంగ శివజ్యోతి, సునీత, పల్లవి, సిఎం రామలక్ష్మీ, వర మేఘన, హేమ ప్రియ, షఫీనా, మైధిలి, అయ్యవారమ్మ, గంగాదేవి, అనిత, కృపా జ్యోతి.

మళ్లీ వాయిదా పడిన గుత్తల వేలం

- పాత పాటదారులకు ఆమోదం ఇవ్వకపోవడంతో అవస్థలు
- గేటు వసూళ్ల ఆరోపణలపై అధికారులు దృష్టి పెట్టాలి



పాటదారుల కోసం వేచి చూస్తున్న కమిషనర్ ప్రమీల

మదనపల్లె : 2025–26 ఏడాదికి మదనపల్లె మున్సిపాలిటికి చెందిన వారపుసంత, దినసరి మార్కెట్, టౌన్ హాలు, ప్రైవేటు బస్టాండ్ గుత్తలను అప్పగించేందుకు వరుసగా ఏడుసార్లు వేలం పాటలను నిర్వహించినా కనీస స్పందన లేకపోతోంది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఏడోసారి వేలంపాటలు మళ్లీ వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు పాటలను నిర్వహిస్తామని కమిషనర్ ప్రమీల ప్రకటించగా పాటదారుల కోసం కార్యాలయంలో ఎదురుచూశారు. పాత పాటదారుడు ఎస్‌ఏ.మస్తాన్ పాటలో పాల్గొనేందుకు వచ్చారు. ఎవరూ రాకపోవడంతో ఆయన వెనుదిరిగి వెళ్లిపోయారు. సాయంత్రం పాటదారులు హాజరవుతారని సమాచారంతో అధికారులు ఎదురుచూడగా ఇద్దరు హాజరైనప్పటికీ వేలంపై ఆసక్తి చూపకుండా వెనుదిరిగి వెళ్లిపోయారు. దీనితో గుత్తలను అప్పగించేందుకు అధికారులు ప్రయత్నించినా వాటిని నిర్వహించుకునేందుకు లీజుదారుల్లో ఆసక్తి లేదని తేలిపోతోంది. వరుసగా జూలై తొమ్మిది, జూలై 17, జూలై 25, జూలై 30, ఆగస్టు 19, తర్వాత శుక్రవారం ఏడుసార్లు వేలంపాటలను నిర్వహించారు. దీనికోసం పత్రికల్లో ప్రకటనలు కూడా జారీ చే శారు. పరిస్థితి చూస్తుంటే ప్రకటనల కోసం చేసిన ఖర్చు కూడా వృథా అయినట్టే కనిపిస్తోంది.

హెచ్చుపాట..ఆమోదం లేదు

వాస్తవానికి 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గుత్తలకు ఈ ఏడాది మార్చి 25న నిర్వహించారు. ఇందులో వారపుసంతకు రూ.పఠాన్ జాఫర్ ఖాన్ రూ.46.38 లక్షలతో హెచ్చుపాటదారునిగా నిలిచారు. దినసరి మార్కెట్‌కు ఎస్‌ఏ.మస్తాన్ రూ.1,18,64,000తో హెచ్చుపాటదారునిగా నిలిచారు. వీరికి గుత్తలను ఏప్రిల్ ఒకటి నుంచి అప్పగించాలి. అయితే కౌన్సిల్ ఆమోదం లేదని అధికారులు తదుపరి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారు. ఈలోపు గత లీజుదారుని గుత్తలీజు పూర్తవ్వడంతో కొత్త లీజుదారులకు అప్పగించ లేదు. దీనితో ఏప్రిల్ నుంచి కొంతకాలం మున్సిపల్ సిబ్బంది గేటు ఫీజును వసూలు చేయగా, ఇటీవల ప్రయివేటు వ్యక్తులు వసూలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. దీనితో గేటు ఆదాయం ఎంత రావాలో, మున్సిపాలిటికి ఎంత జమ అవుతోందో అధికారులు గుర్తించాలి. గేటు వసూళ్లపై ఆరోపణలు వస్తున్నాయి. గత కౌన్సిల్ సమావేశంలో ఓ కౌన్సిలర్ ప్రయివేటు వ్యక్తులతో గేటు వసూళ్లు చేస్తున్నారని ఫోటోలు చూపి ఆరోపించడం తెలిసిందే.

సిబ్బందికి బాధ్యతలు:

లీజు అప్పగించే వరకు మున్సిపల్ సిబ్బందికి గేటు ఫీజు వసూలు బాధ్యతలు అప్పగిస్తే వసూళ్లు పారదర్శకంగా ఉంటాయని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం గుత్త ఆదాయం ఎంత, ఇప్పుడు రోజువారీ వసూళ్లు ఎంత, ఎంత వసూళ్లు తేడా ఉందన్న విషయాన్ని అధికారులు గుర్తించాలి. ఏటా ఆదాయం పెరుగుతూ ఉంటుంది. దాన్ని అంచనావేసి మున్సిపాలిటికి ఎంత ఆదాయం దక్కాలన్న దానిపై అధికారులు సమీక్షించి బాధ్యతలు అప్పగిస్తే వసూళ్లు పక్కదారి పట్టకుండా ఆదాయం సమకూరే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

మళ్లీ వేలం ప్రకటన :

శుక్రవారం నిర్వహించిన వేలంపాటలకు ఇద్దరు హాజరైనా పాటల్లో పాల్గొనకుండా వెళ్లిపోయారు. దీనితో మరోసారి వేలం నిర్వహించేందుకు చర్యలు తీసుకుని ప్రకటన వెలువరిస్తామని కమిషనర్ కే.ప్రమీల తెలిపారు.